ప్రజల చేతిలో
www.ayudamdaily.com
# ఆయుధం
The Common People's Voice
ఆదివారం | జూన్ 21, 2026 | సంపుటి : 7 | సంచిక : 21 | పేజీలు : 2







## పీఎం కిసాన్ నిధులు విడుదల

ఢిల్లీ, ఆయుధం: రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ నిధులు విడుదలయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేశారు. 23వ విడత కింద ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ అయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరింది. కేంద్రప్రభుత్వం 2019లో పీఎంకిసాన్ పథకాన్ని ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2 వేలు చొప్పున మొత్తంగా రూ.6వేలను రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. ఈకేవైసీ చేయని వారికి నిధులు జమ కావు. పీఎం కిసాన్ పోర్టల్‌లో ఈకేవైసీ ఆప్షన్ ఎంచుకుని ఆధార్ నంబర్, ఓటీపీ ద్వారా వెరిఫికేషన్ పూర్తి చేయొచ్చు.

## కిషన్ రెడ్డి సీఎం లేఖ

హైదరాబాద్, ఆయుధం: మెట్రో రైలు పెండింగ్ అంశాల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని కోరుతూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారు. ఐఆర్ఎఫ్‌సీ ఫైనాన్సింగ్, మెట్రో ఫేజ్ 2 అంశాలపై చర్చించాలన్నారు. ఈ నెల 22, 23వ తేదీల్లో తాను ఢిల్లీలో ఉంటానని.. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ‘‘మెట్రో రైలు హైదరాబాద్‌కు, రాష్ట్రానికీ అత్యంత కీలకమైన మౌలిక వసతుల ప్రాజెక్టు. పెండింగ్ అంశాలపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవడం అవసరం. రైల్వే మంత్రితో భేటీ ఏర్పాటు చేస్తే.. అవసరమైన పత్రాలు తీసుకొస్తాను. సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తెలపాలి’’ అని లేఖలో పేర్కొన్నారు.

# ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- పెండింగ్ కేసుల పరిష్కారంతో పాటు హక్కుల పరిరక్షణకు దృష్టి
- తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య



హనుమకొండ, ఆయుధం: ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో అధికారులు అత్యంత బాధ్యతతో వ్యవహరించి, ఫిర్యాదులపై సత్వర చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవితతో కలిసి భూ సమస్యలు, హక్కుల పరిరక్షణ, అట్రాసిటీ కేసుల పురోగతి, సంక్షేమ కార్యక్రమాల అమలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్ విధానం, బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్సీ సంక్షేమ శాఖ, ఎస్సీ కార్పొరేషన్, గిరిజన సంక్షేమ శాఖ, రెవెన్యూ, పోలీసు, విద్యాశాఖ, ముఖ్య ప్రణాళిక విభాగం, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ తదితర శాఖల పనితీరును సమీక్షించారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ప్రజలు తమ సమస్యలను కమిషన్ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిపై సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు నుంచి దర్యాప్తు, ఛార్జిషీట్ దాఖలు వరకు ప్రతి దశలో వేగవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితులకు చట్టప్రకారం అందాల్సిన రక్షణ, ఆర్థిక సహాయం, పునరావాస సదుపాయాలు, న్యాయ సహాయం సకాలంలో అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ఆయా వర్గాల ప్రాంతాల అభివృద్ధికే వినియోగించాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో జిల్లా యంత్రాంగం నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి నెల చివరి శనివారం నిర్వహించే పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమంలో తహసీల్దార్లు, పోలీసు అధికారులు తప్పనిసరిగా పాల్గొని ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించే చర్యలు చేపట్టాలని సూచించారు.

ఉపాధి హామీ పనుల్లో కార్మికులకు తాగునీరు, నీడ, ప్రాథమిక వైద్య సదుపాయాలు కల్పించడం చట్టబద్ధమైన బాధ్యత అని పేర్కొంటూ సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, స్వయం ఉపాధి పథకాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలలో జనాభా నిష్పత్తికి అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అవకాశాలు కల్పించాలని సూచించారు. ఉద్యోగాలలో రిజర్వేషన్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేసి బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన తప్పనిసరిగా నిర్వహించి సమస్యల పరిష్కార పురోగతిని సమీక్షించాలని సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ, సమావేశంలో ప్రస్తావనకు వచ్చిన అంశాలన్నింటిపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కార చర్యలు చేపడతామని తెలిపారు. మోంథా తుఫాను ప్రభావంతో గోపాలపూర్ ఊర చెరువు పరివాహక ప్రాంతాల్లో నీటిముంపు సమస్య ఏర్పడిన నేపథ్యంలో సాగునీటిపారుదల శాఖ ద్వారా అవసరమైన చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. చెరువులో ఉన్న సమాధుల కోసం ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించి కేటాయించనున్నట్లు తెలిపారు.

అంతకుముందు జిల్లా కలెక్టరేట్‌కు చేరుకున్న కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్యకు జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, డీసీపీ ధార కవిత, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డీఎస్ వెంకన్న, పరకాల మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్ తదితరులు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మొక్కను అందజేసి స్వాగతం తెలిపారు. పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా చెరబండ రాజు కాలనీకి చెందిన అర్హులైన కుటుంబాలకు హనుమకొండ న్యూ శాయంపేటలో నిర్మించిన రెండు పడక గదుల గృహాల కేటాయింపు పత్రాలను కమిషన్ ఛైర్మన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రవి, హనుమకొండ, పరకాల, వరంగల్ ఆర్డీవోలు వెంకటేష్, డీఎస్ వెంకన్న, సుమ, కాజీపేట, హనుమకొండ, పరకాల ఏసీపీలు ప్రశాంత్ రెడ్డి, నరసింహారావు, సతీష్ బాబు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ పల్లెపాడు దామోదర్, చుంచు రాజేందర్, పుట్ట రవి, సింగారపు రవిప్రసాద్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.





## అట్రాసిటీ కేసులో.. పోలీసుల నిర్లక్ష్యం

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు జర్నలిస్ట్ ఫిర్యాదు

హనుమకొండ, ఆయుధం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఓ అట్రాసిటీ కేసులో పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై జర్నలిస్ట్ కంకణాల సంతోష్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దర్యాప్తులో నిర్లక్ష్యం వహిస్తున్న పోలీసు అధికారులపై, అలాగే నిందితుడు తుమ్మ శ్రీధర్ రెడ్డిపై తక్షణమే అరెస్ట్ చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య కు ఫిర్యాదు చేశారు. శనివారం హన్మకొండ కలెక్టరేట్ కాన్ఫరెస్ హాల్‌లో ఛైర్మన్ ను కలిసి వినతి పత్రం అందచేశారు. 2025 ఆగస్టు 12న రాత్రి 11 గంటల సమయంలో "CNU Friends" అనే వాట్సాప్ గ్రూపులో తుమ్మ శ్రీధర్ రెడ్డి అనే వ్యక్తి తనను ఉద్దేశించి అత్యంత అసభ్యకరంగా దూషించాడని సంతోష్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీసులు అదే ఏడాది ఆగస్టు 15న నిందితుడిపై FIR నం. 471/2025 (సెక్షన్లు: 352 BNS, 67 IT Act, 3(1)(r) SC/ST POA Act) కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదై 10 నెలలు గడుస్తున్నా సుబేదారి పోలీసులు నిందితుడిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, దర్యాప్తును పూర్తిగా గాలికొదిలేశారని సంతోష్ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల ఉదాసీనత వల్ల నిందితుడు స్వేచ్ఛగా తిరుగుతూ తనను మరింత మానసిక క్షోభకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. ఈ వ్యవహారంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ నేరుగా జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు, నిందితుడు శ్రీధర్ రెడ్డిని తక్షణమే అరెస్టు చేసి తనకు న్యాయం జరిగేలా ఆదేశాలు జారీ చేయాలని కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య ను కోరారు.



## పల్లి గింజ, కందిపప్పు పై యోగాసనాలు

వరంగల్, ఆయుధం: కాశీబుగ్గ వివేకానంద కాలనీ వాసులు మైక్రో ఆర్టిస్ట్ కుసుమ లింగమూర్తి జూన్ 21న ప్రపంచ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని తనదైన శైలిలో కందిపప్పుపై, పల్లి గింజలపై యోగాసనాలు వేశారు. ఇప్పటివరకు చాలా సార్లు వివిధ ఆకృతులతో శనగపప్పుపై, బియ్యపు గింజలపై, ద్రాక్ష పళ్లపై, పెసరపప్పుపై కూడా అద్భుతమైనటువంటి కళాఖండాలను వేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇతను సామాజిక కార్యకర్తగా ఆలయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్‌గా ఇంటర్నేషనల్ కమిటీ ఛైర్మన్ గా సేవా కార్యక్రమాలు చేస్తూ సమాజంలో ఉపయోగపడేటువంటి మెసేజ్ ను పంపిస్తూ ఇలాంటి కళాఖండాలను తీర్చిదిద్దటంలో సిద్ధహస్తుడు. గతంలో జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి అవార్డులు కూడా అందుకున్నారు.

# లాకర్లలో భారీగా నగదు, బంగారం

- ఏసీబీ అధికారుల షాక్
- నరహరి బ్యాంకు లాకర్‌లో రూ.కోటిన్నర నగదు గుర్తించిన ఏసీబీ
- శాలిబండలోని కెనరా బ్యాంకులో నరహరి లాకర్లు తెరిచిన అధికారులు
- ఇటీవల ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నరహరి ఇంట్లో సోదాలు



హైదరాబాద్, ఆయుధం: ఆదాయానికి మించి ఆస్తుల కేసులో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి బ్యాంకు లాకర్లను తాజాగా ఏసీబీ అధికారులు బద్దలు కొట్టారు. లాకర్లో ఏకంగా 1.50 కోట్ల నగదు బయటపడింది. బ్యాంకు లాకర్‌లో భారీగా నగదు చూసిన ఏసీబీ అధికారులు విస్తుపోయారు. ఈ కేసులో ఆయన్ను ఏసీబీ అధికారులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన చంచల్‌గూడ జైల్లో ఉన్నారు. ఈ నెల 16న నరహరి నివాసంతో పాటు ఆయన బంధువులు, కుటుంబసభ్యుల నివాసాల్లో ఏకకాలంలో 10 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు బృందాలుగా ఏర్పడి సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. సోదాల్లో రంగారెడ్డి జిల్లాలో 5 ఓపెన్ ప్లాట్లు, 1.24 ఎకరాల వ్యవసాయ భూమి, పుప్పాలగూడలో 2,500 చదరపు అడుగుల ఫ్లాట్, నార్సింగిలో రెండు విలాసవంతమైన ఫ్లాట్లు, రాజేంద్రనగర్‌లో మరో ఫ్లాట్, గచ్చిబౌలిలో జీ+3 భవనం, ఛత్రినాకలో జీ+2 భవనం, నిందితుడి ఇంట్లో రూ.1.54 కోట్ల నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.2.29 కోట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో రూ.5.04 కోట్లు గుర్తించారు.

సుమారు 1.3 కిలోల బంగారు ఆభరణాలు, 8 కిలోల వెండి స్వాధీనం చేసుకున్నారు. ఆస్తుల విలువ మొత్తం రూ.13.05 కోట్లుగా ఏసీబీ అధికారులు అంచనా వేసినప్పటికీ బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని సమాచారం. అయితే షాలిబండలోని కెనారా బ్యాంకు లాకర్ తాళం ఏసీబీ అధికారులకు ఇచ్చే విషయంలో నరహరి మొండికేసినట్టు తెలుస్తోంది. అయితే కోర్టు ద్వారా సెర్చ్ వారెంట్ తీసుకుని అధికారులు లాకర్లను బద్దలు కొట్టినట్టు సమాచారం. లాకర్‌లో రూ.1.50 కోట్లతో పాటు బంగారు బిస్కెట్లు, బంగారం మొత్తం 2 కిలోల మేర ఉన్నట్టు గుర్తించినట్టు తెలుస్తోంది.

### డిప్యూటీ సర్వేయర్‌గా కారుణ్య నియామకం

జిల్లాల సరిహద్దుల్లో ఉండే భూ వివాదాల ఫైల్స్‌ను తనదైన శైలిలో క్లియర్ చేయడంలో సిద్ధహస్తుడిగా నరహరిరావుకు పేరుంది. రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో పని చేసిన సమయంలో కొందరు ప్రజాప్రతినిధుల భూ సమస్య పరిష్కారంలో కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కారుణ్య నియామకం ద్వారా 18వ ఏట డిప్యూటీ సర్వేయర్‌గా శాఖలో చేరిన నరహరి రావు, పలు ప్రాంతాల్లో వివిధ హోదాల్లో పని చేశారు. 2016లో పదోన్నతి పొంది, 2020 వరకు రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశారు. ఆ సమయంలో ఆరోపణలు రావడంతో హైదరాబాద్ శిక్షణా కేంద్రానికి ప్రభుత్వం బదిలీ చేసింది. 2024 నుంచి 2025 వరకు హెచ్ఎండీఏ ప్రాజెక్ట్ కార్యాలయంలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం డిప్యూటీ డైరెక్టర్ హోదాలో హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో పని చేస్తున్నారు. విలువైన భూములకు సంబంధించిన దస్త్రాల పరిష్కారంలో ఆయన జోక్యాన్ని అధికారులు వెలికి తీస్తున్నారు.



## పేదల ఇండ్ల కూల్చివేత దుర్మార్గం

2లో

- గుండ్ల సింగారం బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం
- ఇండ్ల పట్టాల సాధనకు రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య పోరాటాలు
- నేడు హైదరాబాద్ లో ఇండ్ల స్థలాల సాధనకై అఖిలపక్ష సమావేశం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు




## ఘనంగా ‘నమో జెన్Z కాన్క్లేవ్’

2లో

- రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షురాలు మూగ జయశ్రీ, బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్
- మోడీ 12 ఏళ్ల పాలనపై యువతకు దిశా నిర్దేశం

# నీట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

హనుమకొండ, ఆయుధం: ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న నీట్ యూజీ-2026 పరీక్షల నేపథ్యంలో హనుమకొండలోని ఎల్‌బి కళాశాల పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో అభ్యర్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రవేశ ద్వారాలు, భద్రతా ఏర్పాట్లు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, సీసీ కెమెరాల ఏర్పాటు, పరీక్ష గదుల నిర్వహణ తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పరీక్ష నిర్వహణలో అవాంతరాలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా సక్రమమైన మార్గదర్శకాలు, సహాయ చర్యలు అందుబాటులో ఉంచాలని సూచించారు. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష కావడంతో పరీక్ష నిర్వహణలో పారదర్శకత, క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రానికి వచ్చే అభ్యర్థులు, వారి తల్లిదండ్రులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పరీక్షా కేంద్రం పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, వైద్య సదుపాయాలు, అత్యవసర సేవలను సిద్ధంగా ఉంచాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. పరీక్ష నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పరిశీలించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్లు మహ్మద్ ఇక్బాల్, శ్రీకాంత్, విద్యాసంస్థల యాజమాన్య ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# మంత్రి సురేఖ చిత్రపటానికి పాలాభిషేకం

**వరంగల్, ఆయుధం:** ఇచ్చిన మాట ప్రకారం టెస్కో ద్వారా 30 శాతం నేత కూళ్లు పెంచి ఆర్డర్ కాపీ పంపినందులకు గాను గోపాలస్వామి గుడి జంక్షన్ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ముందు మంత్రి కొండా సురేఖ చిత్రపటానికి నేత కార్మికులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత మాట్లాడుతూ.. చేనేత కార్మికుల నిరసన దీక్ష శిబిరం సందర్శించినప్పుడు కార్మికులు అడిగిన ప్రధాన డిమాండ్ 30 శాతం చేనేత కార్మికులకు నేత కూళ్లు పెరిగినవి మార్చి 31 2026 నుండి అమలు పర్చాలని కోరగా ముఖ్యమంత్రి తో చర్చించి శనివారం చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ చే ఆర్డర్ కాపీ ఇప్పించినట్లు తెలిపారు. చేనేత సంఘాలలో నిల్వ ఉన్న కార్పెట్స్, బెడ్ షీట్స్ ఖరీదులు చేయించినట్లు తెలిపారు. మరలా రెండు లక్షల కార్పెట్స్ రెండులక్షల బెడ్ షీట్స్ కు ఇండెంట్ ఇప్పించినట్లు తెలిపారు. చేనేత కార్మికులు స్వీట్లు తినిపించుకుంటూ పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు దాసరి రాజశేఖర్, సామల శంకర్ పోరండల్ల సుదర్శన్ ముదిగొండ నాగరాజు, ఆడెపు నాగ భూషణం, ఎం.డీ.అంకూస్, దాసరి సాంబయ్య, కొంగ రవి, ఆడెపు మార్కండేయ, దేవులపల్లి సమ్మయ్య, సహకార సంఘాల ప్రతినిధులు అడిగొప్పుల సంపత్, దువ్వల రాజేందర్, యెలుగం సాంబయ్య, పిట్ట రాములు, ఆడెపు రవి, బొల్లు సతీష్, నంబి మురళి, పెండెం రాజేశ్వరి, ఆనందం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# తొలితరం ఉద్యమకారులను ఆదుకోవాలి




**వరంగల్, ఆయుధం:** 1969 తెలంగాణ ఉద్యమ నాయకులు శనివారం వరంగల్ లో సోమరాతి సత్యరాయణ అధ్యక్షతన సమావేశమయ్యారు. ఈ సమావేశానికి తిప్పన సిద్దులు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. 1969 ఉద్యమ నాయకులకు, ప్రాణాలు అర్పించిన వారి కుటుంబసభ్యులకు, ఉద్యమ కారులకు పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు. హెల్త్ కార్డ్ సౌకర్యం కలిపించాలని, 25000 చదరపు గజాల స్థలం, ఉద్యమ నాయకులకు గుర్తింపు సర్టిఫికెట్ ఆ నాటి పోలీస్ రికార్డు ప్రకారం ఇప్పించాలని కోరారు. అలాగే తెలంగాణ పోరాటంలో పోలీసుకాల్పుల లో అమరులైన వీరులకు వరంగల్ హెడ్ పోస్టాఫిస్ వద్ద అమర వీరుల స్థూపం నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ కారులు తిప్పన సిద్దులు, సోమరాతి సత్యనారాయణ, భూర లింగమూర్తి, పులిసారంగపాని, MD.రాజ్ మహమ్మద్, చేరి నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రీ ప్రైమరీ తరగతి ప్రారంభం



**వేలేరు, ఆయుధం;** వేలేరు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతి, సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమానికి వేలేరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి, ఎంఈవో చంద్రమౌగిళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటుందన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో వేలేరు గ్రామంలో ప్రీ ప్రైమరీ మంజూరు చేయడం జరిగిందని, పాఠశాల అభివృద్ధికి తప్పనిసరి కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగపరచుకొని బాగా చదువుకోవాలని సర్పంచ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకర్, స్థానిక ప్రధానోపాధ్యాయురాలు లీలా బాయ్, హైస్కూలు హెచ్ఎం సత్యం, జీపీ కార్యదర్శి విజయ, పిఆర్టియు మండల అధ్యక్షులు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# పాఠశాలలో జిల్లా అధికారుల తనిఖీ



**నడికూడ, ఆయుధం:** మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక పాఠశాల కోసం గదుల, భౌతిక వసతులను పరిశీలించుటకు ఏర్పాటుచేసిన జిల్లా తనిఖీ బృందం వంగల శ్రీపాల్ రెడ్డి, వల్లంపట్ల శ్యాంసుందర్ పాఠశాలను శనివారం సందర్శించారు. ప్రీ ప్రైమరీ ప్రత్యేక తరగతి గది, మంచి స్థితిలో ఉండటము, పెయింటింగ్ వేయుటకు అనుకూలంగా ఉన్నదా లేదా, పిల్లలకు అనుకూలమైన గోడ చిత్రాలు ఉన్నాయా లేవా.. తగినంత వెలుతురు ఉందా లేదా తగినంత గాలి ప్రసరణ ఉందా లేదా,విద్యుత్ సౌకర్యం అందుబాటులో ఉన్నదా లేదా ఫ్యాన్లు, లైట్లు పని చేస్తున్నాయా లేవా, తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉన్నదా లేదా, మరుగుదొడ్డి సౌకర్యం, ప్రహరీ గోడ, పాఠశాల ప్రాంగణం పిల్లలకు సురక్షితంగా ఉందా లేదా, ఆట స్థలం, ఇండోర్ ఆట సామగ్రి అందుబాటులో ఉందా లేదా అని అన్ని విషయాలను సమగ్రంగా పరిశీలించారు. ప్రీ ప్రైమరీ తరగతి గదికి కావలసినవి అన్నీ భౌతిక వసతులు సిద్ధంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారని ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లకావత్ దేవా, కంచ రాజు కుమార్, పుల్లూరి రామ కృష్ణ పాల్గొన్నారు.




# భక్తి శ్రద్ధలతో శ్రీశనేశ్వర స్వామికి తైలాభిషేకం


**నాగర్ కర్నూల్, ఆయుధం:** బీజినేపల్లి మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో గల శ్రీశనేశ్వర స్వామికి శనివారం తైలాభిషేకం నిర్వహించారు. శ్రీసార్థాసప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామికి శనివారం ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ.. ఈ మాసంలో స్వామివారిని కొలిచిన అత్యధిక సంతృప్తి పొంది విశేష ఫలితాన్ని భక్తులకు ఇస్తారని అన్నారు. జన్మరిత్యా, గోచార రీత్యా శనిగ్రహ దోష నివారణకు స్వామివారిని శక్తిమేరకు పూజించాలని అన్నారు. ఈ ఆలయంలో గోన బుద్ధారెడ్డి కాలంనాటి బ్రహ్మ సూత్రం గల పరమశివునికి భక్తులచే రుద్రాభిషేక పూజలు, అర్చనలు, దీపారాధన నందీశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు, గ్రామ సర్పంచ్ టి.సుగుణమ్మ, కమిటీ సభ్యులు కెంచె రాజేష్, ప్రభాకరచారి, పుల్లయ్య, అడ్వకేట్ వీర శేఖర్ చారి, శ్రీకాంత్ రెడ్డి, ఆలయ అర్చకులు శాంతి కుమార్, ఉమమహేశ్వర్, సిబ్బంది గోపాల్ రెడ్డి భక్తులు పాల్గొన్నారు.

యోగాలో రాణిస్తున్న

# అభినవ నేతాజీ







వరంగల్ కు చెందిన అడుప అభినవ నేతాజీ చిన్నప్పటి నుంచే యోగాలో రాణిస్తున్నాడు. సాంబశివరావు, జ్యోతి దంపతుల మొదటి కుమారుడు అభినవ నేతాజీ చిన్నప్పటి నుండి తన తల్లి తండ్రుల యోగా సాధన చేయడంతో పాటు టీవీలో ప్రముఖ యోగా గురువు వేస్తున్న ఆసనాలను చూస్తూ ఆసక్తి పెంచుకొని తాను యోగా చేయడానికి ప్రయత్నించాడు. తన పదేళ్ల వయసు నుంచి యోగా గురువు బొలిశెట్టి కమలాకర్ ఆధ్వర్యంలో యోగ సాధనలో శిక్షణ పొందాడు. గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్యర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరంలో సైతం శిక్షణ పొందాడు.

**జాతీయ స్థాయిలో..**

విద్యార్థి దశ నుంచే అభినవ నేతాజీ జాతీయ స్థాయి క్రీడాకారుడిగా ఎదిగాడు. 2017లో యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 42వ జాతీయస్థాయి యోగా ఛాంపియన్ షిప్ ఘజియాబాద్ లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. 2019లో మహారాష్ట్రలోని ఔరంగాబాద్ లో జరిగిన 64వ నేషనల్ స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొన్నాడు. 67వ నేషనల్ స్కూల్ గేమ్స్ 2023 లో జరిగిన త్రిపుర రాష్ట్రంలో అగర్తలా జరిగిన జాతీయ యోగ పోటీలో పాల్గొన్నారు. యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హిమాచల్ ప్రదేశ్ లోని ఉనాలో 2024లో జరిగిన జాతీయస్థాయిలో పాల్గొన్నాడు. తెలంగాణ రాష్ట్రం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ 2024, 2025 సీఎం కప్ పోటీల్లో రెండుసార్లు పాల్గొని రాష్ట్రస్థాయి యోగాలో కాంస్య పతకాన్ని సాధించి హ్యాట్రిక్ సాధించాడు. తాను యోగా సాధన చేయడమే కాకుండా విద్యార్థులకు, పెద్దలకు సైతం యోగాను నేర్పిస్తున్నాడు. ప్రతి ఒక్కరు యోగాను నేర్చుకొని ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నారు. తాను నేర్చుకున్న యోగాను అందరికి నేర్పిండమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

# పేదల ఇళ్ళు కూల్చివేత దుర్మార్గం

- గుండ్ల సింగారం బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం
- ఇండ్ల పట్టాల సాధనకు రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య పోరాటాలు
- నేడు హైదరాబాద్ లో ఇండ్ల స్థలాల సాధనకై అఖిలపక్ష సమావేశం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**హనుమకొండ, ఆయుధం:** హనుమకొండ గుండ్ల సింగారంలో శనివారం పేదల ఇళ్ళు కూల్చి వేయడం దుర్మార్గమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం గుండ్ల సింగారంలో పేదల ఇళ్ళు కూల్చివేత విషయం తెలుసుకున్న కూనంనేని సాంబశివరావు హుటా హుటిన హైదరాబాద్ నుండి విచ్చేసి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా సిపిఐ నాయకులతో కలిసి గుండ్ల సింగారంలో సందర్శించారు. ఈ సందర్భంగా గుడిసె వాసులు సిపిఐ నాయకులకు తమ గోడు వెళ్లబోసుకుని, చిన్న పిల్లలు, మహిళలు అని చూడకుండా తమను తమ ఇండ్ల నుండి ఈడ్చి పడేశారని తెలిపారు. అలాగే బియ్యం, ఇతర నిత్యావసరాలను రోడ్డు పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, విద్యార్థుల సర్టిఫికేట్ లను సైతం తీసుకోనివ్వకుండా పోలీసులు ఈడ్చుకొని వెళ్లారని విద్యార్థులు తెలిపారు. అనంతరం కూనంనేని సాంబశివరావు మీడియాతో మాట్లాడుతూ... హనుమకొండ గుండ్ల సింగారంలో ఇండ్లు కోల్పోయిన పేదలకు న్యాయం జరిగే వరకూ తాము అండగా ఉంటామని అన్నారు. భూకబ్జాదారులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నా స్పందించని అధికారిక యంత్రాంగం నిలువ నీడ లేని పేదలు 50 గజాల స్థలంలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారిపై అర్ధ రాత్రివేళ దొంగల మాదిరిగా దాడి చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా గుడిసెలు వేసుకున్న పేదల పై ప్రతాపం చూపుతున్నారని, దీనిపై ముఖ్యమంత్రి స్పందించి ఇలాంటి దుశ్చర్యలను నిలుపుదల చేయాలని, నిలుపుదల చేయని ఎడల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అన్నారు. ఇలాంటి దుశ్చర్యలను నిలుపుదల చేయకుంటే హనుమకొండ, వరంగల్ జిల్లాల నుండే రాష్ట్ర వ్యాప్తంగా పేదల ఇళ్ళ స్థలాల పోరాటం ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.తాము ప్రభుత్వానికి మిత్ర పక్షంగా ఉన్నప్పటికీ పేదల కోసం ఇలాంటి ప్రజా వ్యతిరేక చర్యలను ఎండగడుతామని హెచ్చరించారు. వామపక్షాల ఆధ్వర్యంలో పేదల ఇళ్ళు, ఇండ్ల స్థలాలు, భూ సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. దీనిపై ఆదివారం హైదరాబాద్ లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మక్దూం భవన్ లో అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా భూ సమస్యలపై ఒక భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకుని ముందుకు సాగుతామని చెప్పారు. ఈ సందర్భంగా గుండ్ల సింగారంలో ఇండ్ల కూల్చివేతకు గురైన బాధితులతో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పేదలందరూ ఐక్యంగా నిలబడాలని, సిపిఐ పూర్తిగా అండగా ఉంటుందని చెప్పారు. ఇండ్ల పట్టాలు సాధించే వరకూ విశ్రమించేదిలేదని చెప్పారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ జైలుకు అయినా వెళతాము కాని భూమిని వదిలేది లేదన్నారు. భూమి సాధించుకనే వరకు సిపిఐ మీ వెంటనే ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సిపిఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి, సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషుమియా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, మేకల రవి, మంద సదాలక్ష్మి, వలీ ఉల్లాఖాద్రి, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, నాయకులు ఎం. చుక్కయ్య, బొట్ల చక్రపాణి, లక్ష్మణ్, సంతోష్, జక్కు రాజు గౌడ్, శ్రీనివాస్, రవి, రాజు కుమార్, రాజు, రాజేందర్, రాము, గోపాల్ చారి, అమృతయ్య, కృష్ణ, మంగ, బాబు, దామోదర్, శివ, నరేందర్, ప్రసాద్, ప్రశాంత్, మౌనిక, సంధ్య, మమత, రజిత, రోహిత్, సురేష్, గుడిసె వాసులు పాల్గొన్నారు.

# బీజేవైఎం ఆధ్వర్యంలో ఘనంగా 'నమో జెన్Z కాన్క్లేవ్'


- రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షురాలు మూగ జయశ్రీ, బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్
- మోడీ 12 ఏళ్ల పాలనపై యువతకు దిశా నిర్దేశం




**వరంగల్, ఆయుధం;** భారతీయ జనతా యువమోర్చా వరంగల్ జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్ ఆధ్వర్యంలో నగరంలోని సత్యం కన్వెన్షన్ హాల్లో 'నమో జెన్Z కాన్క్లేవ్' సమావేశం శనివారం నిర్వహించారు. నవభారత నిర్మాణంలో యువత పాత్ర, దేశ ప్రగతిపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మూగ జయశ్రీ, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 12 సంవత్సరాల సుపరిపాలనలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదుగుతోందని కొనియాడారు. డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా వంటి పథకాలు నేటి 'జెన్Z' (Gen Z) యువతకు సరికొత్త అవకాశాలను సృష్టించాయని వివరించారు. దేశ భద్రత, ఆర్థిక వృద్ధి, మౌలిక వసతుల కల్పనలో మోడీ ప్రభుత్వం సాధించిన విజయాలను యువతకు వివరించి, వారిని దేశ నిర్మాణంలో భాగస్వాములను కావాలని దిశా నిర్దేశం చేశారు. దశాబ్దాల పాటు కాంగ్రెస్ యువతకు కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుందని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఇచ్చిన ఉద్యోగాల నోటిఫికేషన్లు, నిరుద్యోగ భృతి హామీలను గాలికొదిలేసిందని ఆరోపించారు. వరంగల్ జిల్లాలో యువత అంతా మోడీ గారి అభివృద్ధి విధానాలకు ఆకర్షితులవుతున్నారని చెప్పారు. దేశ సరిహద్దుల రక్షణ నుండి అంతరిక్ష రంగం వరకు భారత్ సాధిస్తున్న ప్రగతిని చూసి యువత గర్విస్తోందన్నారు. వరంగల్ జిల్లా బీజేవైఎం శ్రేణులు నిరంతరం యువత సమస్యలపై పోరాడుతూనే, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రత్నం సతీష్, ప్రోగ్రాం జిల్లా కన్వీనర్ కనుకుంట్ల రంజిత్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై. శ్రవణ్, ప్రశాంత్, జిల్లా బీజేవైఎం పదాధికారులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల ప్రాణాలు గాలికొదిలేస్తారా?

- శాలినీనగర్‌లో కుక్కల దాడిలో బాలికకి తీవ్ర గాయాలు
- పరామర్శించిన బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్
- మెరుగైన వైద్యం, ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్



**వరంగల్, ఆయుధం:** వరంగల్ నగరంలోని లేబర్ కాలనీ శాలినీనగర్‌లో వీధి కుక్కల దాడిలో ఏడాదిన్నర బాలిక తీవ్రంగా గాయపడటం పట్ల బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఎంజీఎం ఆసుపత్రికి చేరుకుని, చికిత్స పొందుతున్న బాలుడిని పరామర్శించారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ.. బిహార్ రాష్ట్రానికి చెందిన వలస కూలీలు రీతు, అజయ్ దంపతులు బతుకుదెరువు కోసం ఇటీవల వరంగల్ నగరానికి వలస వచ్చారని తెలిపారు. భవన నిర్మాణ పనుల్లో భాగంగా శాలినీనగర్‌లో తల్లిదండ్రులు పని చేసుకుంటుండగా, ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిపై వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడం అత్యంత దారుణమన్నారు. ఈ దాడిలో బాలిక ముఖం, చేతులపై తీవ్ర గాయాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత బాలిక పరిస్థితిని పరిశీలించిన అనంతరం గంట రవికుమార్ ఎంజీఎం ఇన్చార్జ్ సూపరింటెండెంట్, సంబంధిత ఈఎన్‌టీ వైద్యులతో మాట్లాడారు. బాలిక ఎటువంటి లోటు లేకుండా తక్షణమే అత్యుత్తమ, మెరుగైన వైద్య సేవలు అందించాలని, త్వరగా కోలుకునేలా ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలని కోరారు. నగరంలో వీధి కుక్కల అదుపుపై మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని గంట రవికుమార్ ధ్వజమెత్తారు. మంత్రి కొండా సురేఖ, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాప్రతినిధులు ప్రజల ప్రాణాల కంటే రాజకీయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, రాష్ట్ర నాయకులు మార్టిన్ లూథర్ పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

**వరంగల్, ఆయుధం:** నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతూ నిమ్స్ హాస్పటల్లో చికిత్స నిమిత్తం వరంగల్ తూర్పు గిర్మాజీ పేటకు చెందిన పోలెపాక రేణుక కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య రూ.5లక్షల ఎల్ఓసి అందజేశారు. పేద కుటుంబానికి చెందిన ఆమె వైద్యం కోసం అంత మొత్తాన్ని వెచ్చించే స్తోమత లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ సోమ లక్ష్మి ద్వారా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య దృష్టికి తీసుకెళ్లగా రూ.5 లక్షలకు గాను ఎల్ఓసి ఇప్పించారు. కార్యక్రమంలో టీపిసిసి సభ్యులు నల్లగొండ రమేష్, మాజీ కార్పొరేటర్లు బస్వరాజు శిరీష శ్రీమాన్, తత్తరి లక్ష్మణ్, నాకులు సోమ లక్ష్మి, గోరంట్ల రాజు, బొలుగుడ్డు శ్రీనివాస్, గిరిగిరి పుష్పక్క, డా. బయ్యా సాంబమూర్తి, కట్కూరి అన్వేశ్, సన్నీ, పాల్గొన్నారు.



# మండల రాములు కుటుంబానికి పరామర్శ

**వరంగల్, ఆయుధం:** రంగశాయిపేటలో ఇటీవల మృతిచెందిన మండల రాములు కుటుంబాన్ని బతుకమ్మ గ్రూప్ మహిళా సభ్యులు శనివారం పరామర్శించారు. రాములు చిత్రపటానికి పుష్పములు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం గ్రూప్ సభ్యులు మాట్లాడుతూ రాములు చేసిన సేవలను కొనియాడారు. రాములు ఇద్దరు కుమారులు మండల పరశురాములు, నరసింహ రాములు తండ్రిలాగే ప్రజలలో మంచి పేరును తెచ్చుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బోల్లేపెల్లి మల్లికాంబ, గ్రూప్ సభ్యులు సునీత, దనలక్ష్మి, రమ, సరోజన, పుష్ప, యాదమ్మ. వెంకటలక్ష్మి, జీ.సునీత, సుమలత, బోల్లెపెల్లి రాజశేఖర్ ఉన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695